# - ఆర్షవిద్యా తరంగాలు -

## 1.పురుష సూక్తం

### అద్వైత పరంగా వివరణ: కే. వి. రాఘవ రావు



సదా శివ సమారంభాం శంకరాచార్య మధ్యమాం।
అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరంపరాం॥

# - ఆర్షవిద్యా తరంగాలు -

## 1.పురుష సూక్తం

**అద్వైత పరంగా వివరణ: కే వి రాఘవ రావు**

మహిమాన్వితమైన ఈ పురుష సూక్తం వేదమంత్రాలలో అద్వైత భావంతో కూడింది. పురుష అనే పదానికి భగవంతుడని అర్థం. భగవద్విభూతిని శ్లాఘించే సూక్తం ఇది. వేదంలో మూడు ప్రధాన అంశాలు ఉన్నాయి.అవి - సంహిత - అనేక దేవతల ప్రార్థనలు, బ్రాహ్మణం - యాగ విధి, అరణ్యకం (ఉపనిషత్తులు) - భగవంతుని స్వరూప, తటస్థరూప వివరణ. ఈ మూడు అంశాలు పురుషసూక్తంలో ఉన్నాయి. పురుషసూక్తం భగవంతుని విభూతిని శ్లాఘిస్తూ మొదలౌతుంది. ఆయన సంకల్పంతో ఈ సృష్టి జరగడం, అది ఒక యజ్ఞమన్నట్టు చిత్రంగా వర్ణించడం జరుగుతుంది. చివరకి సృష్టి ఒక మిథ్యగా, నాటకంగా ఆ అనంతశయనుడి స్వప్నంలా నిరూపణ అవుతుంది. ఇక్కడ వున్నదంతా ఆయనే, ఆయనకి భిన్నంగా ఏదీ లేదు. మోక్షానికి ఈ నిశ్చయ జ్ఞానమే మార్గం అని ఢంకా కొట్టి మరీ చెపుతుంది ఈ పురుషసూక్తం.

పురుషసూక్తంలోకి ప్రవేశించే ముందు అసలు సృష్టి అంటే ఏమిటి అని పరిశీలన చేద్దాం. అసలీ సృష్టి అనే పదమే సరైనది కాదు. ఎందుకంటే సృష్టి అని ఎప్పుడంటాం? ఇక్కడ లేనిదంటూ ఏదైనా కొత్తగా వస్తే అది సృష్టి అవుతుంది. ఇక్కడ వున్నదంతా ఆయనే - **ఏకమేవాద్వితీయం బ్రహ్మ**. ఆయన తప్ప మరొకటి లేదు అంటుంది వేదం పదే పదే. మరయితే ఈ కనిపించేదంతా ఏమిటి? నేనెవరిని?

ఈ విషయం మనకి అర్థమయ్యేలా మనకి తెలుసున్న ఉదాహరణల ద్వారా వేదం బోధిస్తుంది. ఉదాహరణకి కుమ్మరి - కుండ తీసుకుందాం. కుమ్మరి కుండ చేయడానికి రెండు కారణాలు.మొదటిది కుమ్మరి నేర్పరితనము (కుండ చేసే నేర్పు). దీనిని నిమిత్త కారణం అందాం. రెండవది కుండ తయారీకి కావలిసిన ముడి సరుకు - మట్టి. దీనిని ఉపాదాన కారణం అందాం. ఇప్పుడు ఈ జగత్తుని చూస్తే ఇదంతా ఒక నియతి లేదా ప్రణాళిక ప్రకారం సృష్టించబడినట్టుగా వుంది. దీనికి ఖచ్చితంగా ఓ నిర్మాత లేదా కారకుడు ఉండాలి.అంటే ఒక నిమిత్త కారణం ఉండాలి.

అదే భగవంతుడు అందాం. బావుంది! ఆయన చేసిన ఈ సృష్టికి మరి ముడి సరుకేది? ఇక్కడ మనకో ధర్మసంకటం ఏర్పడుతుంది. ముడి సరుకు వుంది అంటే ఆయన కన్నా భిన్నమైనది మరొకటుందని వస్తుంది. అప్పుడాయన ఏకత్వానికి భంగం కలుగుతుంది. దీనికి వేదం ఆయనే ముడి సరుకు అయ్యాడు అంటుంది. అంటే ఆయనే నిమిత్తకారణం, ఆయనే ఉపాదాన కారణం కావాలి.

ముండకోపనిషత్తులో ఈ విషయమే - **యథోర్ణనాభిః సృజతే గృహ్ణతే చ యథా పృథివ్యామ్ ఓషధయః సంభవన్తి।** అనే మంత్రం ద్వారా ప్రకటిస్తుంది. సాలె పురుగు తననుంచే ఎలా తన గూడుకు కావల్సిన దారం సృష్టిస్తుందో. ఆ విధంగా భగవంతుడే ఈ జగత్తుకు ముడి సరుకయ్యాడు. ఆయనే జగత్తుగా మారాడా? అలాంటప్పుడు రెండు రకాల మార్పులు సంభవించవచ్చు. మొదటి విధంగా - ఉదాహరణకి పాలు పెరుగుగా మారింది. పాలు నశించి పెరుగయింది. దీనిని పరిణామం అందాం. జగత్తు భగవంతుని పరిణామం వల్ల ఏర్పడినది కాదు. పరిణామం అయితే జగత్తు సృష్టి అనంతరం భగవంతుడు వుండడు. ఆయనే జగత్తుగా మారి పోయాడు కాబట్టి.

రెండో విధంగా - మన స్వప్నసృష్టి తీసుకుంటే, ఆ స్వప్నంలో నేనే అనేకంగా ప్రకటించ బడుతున్నాను. స్వప్నంలో మనుష్యుల్లాగా, పర్వతాల్లాగా, జలపాతాల్లాగా. వీటికి ముడిసరుకు ఎక్కడనుంచి వచ్చింది? ఈ స్వప్నసృష్టికి కావల్సిన నైపుణ్యం, తెలివి తేటలు ఎక్కడనుంచి వచ్చాయి? అవన్నీ నానుంచే వచ్చాయి. నేనే నా స్వప్నానికి నిమిత్త కారణం, నేనే నా స్వప్నానికి ఉపాదాన కారణం కూడా. అయితే నేనే ఇన్నిగా మారి పోయానా? లేదు. మంచం మీద హాయిగా పడుకుని వున్నాను. నేను ఏమాత్రం మారకుండా ఈ స్వప్నమంతా నాలో ప్రకటితమౌతోంది. దీనిని వివర్తము అందాము. అంటే భగవంతుడు తాను మారకుండా ఈ జగత్తులా వివర్తం చెందాడన్న మాట. మరో విషయం, నా స్వప్నంలో ఏ వస్తువైనా, ఏ జీవైనా నా కన్నా భిన్నంగా లేవు. అవన్నీ నా మనస్సు కల్పించిన ప్రకటరూపాలే. అదే విధంగా ఈ సృష్టిలో ఏదీ ఆ భగవంతుడు కన్నా భిన్నంగా లేదు. ఈ కనిపించేదంతా ఆయన ప్రకటరూపమే. అంటే **భగవంతుడు ఈ జగత్తుకు అభిన్న వివర్త నిమిత్త ఉపాదాన కారణం** అన్న మాట.

**అభిన్నం** - కుండ మట్టి కన్నా భిన్నంగా లేదు. మట్టే కుండలా కన్పిస్తోంది. కుండ నుంచి మట్టిని వేరు చేయలేం. అలాగే ఈ జగత్తు బ్రహ్మకన్నా భిన్నంగా లేదు. జగత్తుకి బ్రహ్మ అభిన్న కారణం.

**వివర్తం** - టీవీ తెరమీద పడే బొమ్మలు కాంతి కన్నా భిన్నంగాలేవు. ఈ బొమ్మల్నించి కాంతిని వేరుచేయటం సాధ్యంకాదు. అంటే కాంతే ఒక కాలంలో ఒక ప్రదేశంలో హీరోలా, హీరోయిన్‌లా, విలన్‌లా కన్పిస్తోంది. అంటే కాంతి

అలా మారిపోయిందా? లేదు కేవలం అలా కనిపిస్తోందంతే. అదే మాదిరిగా బ్రహ్మ ఏమాత్రం మారకుండా జగత్తులా ప్రకటమౌతున్నాడు. బ్రహ్మ ఈ జగత్తుకి వివర్తకారణం.

**ఉపాదానం** - జగత్తుకు ముడిసరుకు బ్రహ్మే. అలాకానట్టయితే బ్రహ్మ, ముడిసరుకు రెండు వస్తువులున్నట్టు. బ్రహ్మ అద్వితీయం. కాబట్టి రెండవ వస్తువు మాటే రాదు, ఇది ఉపాదాన కారణం.

**నిమిత్తం** - నా కలకు ప్రణాళిక నానుంచే వస్తోంది. అదే విధంగా జగత్తు సృష్టి ప్రణాళిక ఆ బ్రహ్మ నుంచి వచ్చింది. ఇది నిమిత్త కారణం.

**సృష్టి వర్ణన** - బృహదారణ్యంలో సృష్టివర్ణన ఇలా వుంది. బ్రహ్మ మొదట మను,శతరూప అనే జంటని సృష్టించాడు. వారినుంచి మనుష్య సృష్టి జరిగింది. ఆ తరువాత శతరూప ఆవుగా మారింది. మను ఎద్దుగా మారాడు. వారి నుంచి పశుసృష్టి జరిగింది. సృష్టి వర్ణన ఇలా సాగుతుంది. ప్రశ్నోపనిషత్‌లో మిధునసృష్టి గురించి వుంటుంది. సృష్టి జంటలు జంటలుగా చెప్పడింది. సూర్యుడు - చంద్రుడు, రాత్రి - పగలు, ఇలా పరస్పర విరుద్ధమైన జంటలుగా పుట్టినట్టు వుంటుంది. తైత్తిరీయ ఉపనిషత్‌లో - **ఏతస్మాత్ ఆత్మన ఆకాశ సంభూతః। ఆకాశాద్వాయుః। వాయోరగ్నిః। అగ్నేరాపః। అద్భ్యః పృథ్వీ॥** ఆత్మ నుంచి సూక్ష్మ భూతసృష్టి, దానినుంచి స్థూల ప్రపంచ సృష్టి జరిగినట్టుగా ఉంటుంది. ఇక్కడ పురుషసూక్తంలో నాటకీయంగా సాకారపురుషుడు నుంచి సృష్టి జరిగినట్టుగా వర్ణించబడింది.

సృష్టి విషయంలో వేదం అనేక రకాలుగా చెపుతోంది ఒకే మాదిరిగా చెప్పటం లేదు. ఎందుకు? సృష్టి కేవలం కాల్పనికం. పారమార్థిక సత్యంగా వున్నదంతా బ్రహ్మే. ఆ బ్రహ్మతత్వమే ఇన్ని విధాలుగా భాసిస్తోంది. మన స్వప్నసృష్టిలో మనస్సు వాసనామయ జగత్తుని కల్పిస్తుంది. ఆ స్వప్న సమయంలో మనం అదే నిజమని తదనుగుణమైన భావోద్వేగాలకి లోనవుతాము. అదే విధంగా నిరాకార నిర్గుణ పరబ్రహ్మ తానేమాత్రం మారకుండా మాయ సాయంతో ఈ జగత్తును సృష్టించాడు. మొదట సృష్టి గురించి చెప్పడం, తర్వాత సృష్టిని మిథ్యగా నిరాకరించడం జరుగుతుంది. దీనిని శాస్త్రంలో **అధ్యారోప - అపవాద న్యాయం** అంటారు.

అధ్యారోప - అపవాద న్యాయం నాలుగు దశలలో మనం అర్థం చేసుకోవచ్చు. **మొదటిదశ** - ఒక కుండని తీసుకుందాము. కుండ ఒక కార్యము (ఉత్పత్తి అయిన వస్తువు) అనుకుందాం. **రెండవదశ** - కుండ ఒక కార్యం అనుకుంటే దానికి కారణం కావాలి కదా, కారణం మట్టి. ఈ రెండు దశలని అధ్యారోపం అంటారు. **మూడవదశ** - కుండ, మట్టి అనే రెండు పేర్లు కనిపిస్తున్నాయి. కుండ అనే పదార్థము లేదు. కాని మట్టి అనే పదార్థముంది. అంటే పదార్థంగా కుండని మనం చూడలేము. కుండ కేవలం నామము మాత్రమే. పదార్థంగా మట్టి మాత్రమే ఉంది. కుండ అనే కార్యం పదార్థకోణంలో నిరాకరించబడింది. ఇప్పుడు కార్యం లేదు. ఇది మూడవదశ. **నాలుగవదశ** - కార్యం లేకపోతే కార్యం ఏర్పడానికి కావల్సిన కారణత్వం కూడా లేదు. కార్య కారణ విలక్షమైన మట్టి మాత్రమే ఉంది. మూడు నాలుగు దశలను అపవాదం అంటారు.

**కార్యేహి కారణం పశ్యేత్ పశ్చాత్ కార్యం విసర్జయేత్।**
**కారణత్వం తతో గచ్ఛేదవశిష్టణం భవేన్మునిః॥ అపరోక్షానుభూతి - 139**

దీనిని జగత్తుకు అన్వయిస్తే సృష్టి ప్రకరణం అధ్యారోపం అవుతుంది. పారమార్థిక సత్యం దృష్ట్యా జగత్తు కల్పన మాత్రమే.మనం జాగ్రదావస్థలో ఎలా కల నిజమైనది కాదని తెలుకుంటామో ఆ విధంగా ఈ జగత్తు సర్వం - సత్ చిత్ ఆనంద పరమాత్మ ప్రకట రూపమే.ఆయనకి భిన్నంగా ఇక్కడ ఏదీలేదు. ఈవిధంగా జగత్తు మిథ్యగా చూపబడింది. పారమార్థిక సత్యంగా నిరాకరించ బడింది. దీనిని అపవాదం అంటారు. సినిమా ప్రొజక్టరు నుంచే వచ్చే కాంతి ఒకటే. అది తెర మీద పడ్డప్పుడు హీరో లాగ, హరోయిన్ లాగా, విలన్‌లాగా, కమేడియన్ లాగ కన్పిస్తుంది. నిజానికి అది ఒకే కాంతి. ఈ కాంతి లాగే ఒకే పరమాత్మ అనేకంగా భాసిస్తున్నాడు.

అధ్యారోప - అపవాద న్యాయం వల్ల ప్రయోజనం ఏమిటి? మొదట మనం నిజమని తాదాత్మ్యం చెందుతూ భావోద్వేగానికి సదా గురవుతున్న ఈ జగత్తు, ఈ శరీరత్రయం మిథ్య లేదా అనాత్మ అని తేలి పోయింది. (ఇది మిథ్యత్వ దర్శనం). కార్యంగా కనిపించే జగత్తుకి అధిష్టానం బ్రహ్మ లేదా ఆత్మ. అంటే మనం చూసేది, వినేది, స్పృశించేది, అనుభవించేది అంతా బ్రహ్మానుభవమే. సచ్చిదానంద పరమాత్మ ఈ విధంగా మనకి అన్నిటా దర్శనమిస్తూనే వున్నాడు. వివిధంగా, భిన్నంగా కనిపించే ఇదంతా పరమాత్మే. మనం చూడడమే తరువాయి. అంతా పరమాత్మ అయితే రాగ ద్వేషాలెవరి మీద? ఇది జగదేక నందనవనం. ఉన్నది బ్రహ్మానందమే బ్రహ్మానందం. నా స్వరూపమే ఆత్మ లేదా బ్రహ్మ. నేనే ఇదంతా. నాకు వెలితి లేదు, లోటు లేదు. (పూర్ణత్వదర్శనం). పురుషసూక్త పరంగా అధ్యారోప అపవాదమెలా జరిగిందో చూద్దాం.

# పురుషసూక్తం

**ఓం తచ్ఛం యోరావృణీమహే। గాతుం యజ్ఞాయ।గాతుం యజ్ఞపతయే।**
**దైవీ స్వస్తిరస్తునః। స్వస్తిర్మానుషేభ్యః। ఊర్ధ్వం జిగాతు బేషజమ్।**
**శం నో అస్తు ద్విపదే। శం చతుష్పదే॥**

**ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

యః = ఎవరు, శం = మంగళం ప్రసాదిస్తారో, తత్ = ఆ భగవంతుని, ఆవృణీమహే = ప్రార్థిస్తాము, యజ్ఞాయ = యజ్ఞం చక్కగా సాగాలని, గాతుం = కోరుతున్నాము, యజ్ఞపతయే = యజ్ఞకర్తకు సుఖశాంతులు ఇమ్మని, గాతుం = కోరుతున్నాము, నః = మాకు, దైవీ = దేవతలు, స్వస్తిః అస్తు = మేలు చేయుగాక, మానుషేభ్యః = మానవులందరికి, స్వస్తి = మేలు కలుగుగాక, బేషజమ్ = చెట్టుచేమలు, ఊర్ధ్వం జిగాతు = ఊర్ధ్వముఖంగా పెరుగుగాక, నః = మనవద్ద ఉన్న, ద్విపదే = రెండు పాదాల జీవులకు, శం అస్తు = సుఖం కలుగు గాక, చతుష్పదే = నాలుగు పాదాల జీవులకు, శం = మేలు జరుగు గాక.

ఎవరివల్ల మనకు శుభాలు కలుగుతాయో ఆ భగవంతుని ప్రార్థిద్దాం. యజ్ఞం నిర్వర్తించే వారికోసం, యజ్ఞం ఏ విఘ్నాలు లేకుండా పరిసమాప్తి కావాలని ప్రార్థిద్దాం. దేవతలు మనకు శుభం కలుగ చేయుగాక. మానవులందరికీ మేలు కలుగ చేయుగాక. చెట్లు ఉర్ధ్వముఖంగా ఏపుగా పెరుగుగాక. మన వద్ద జీవిస్తున్న రెండు కాళ్ళు, నాలుగు కాళ్ళ జీవులు సుఖంగా వుండు గాక. మాకు ఆదిభౌతిక, ఆదిదైవిక, ఆధ్యాత్మిక ప్రతిబంధకాలు లేకుండుగాక.

**ఓం సహస్రశీర్షా పురుషః। సహస్రాక్షః సహస్రపాత్।**
**స భూమిం విశ్వతో వృత్వా। అత్యతిష్ఠద్దశాంగులమ్॥**
**పురుష ఏవేదగ్ం సర్వమ్। యద్భూతం యచ్చ భవ్యమ్।**
**ఉతామృతత్వస్యేశానః। యదన్నేనాతిరోహతి॥**

పురుషః = భగవంతుడు, సహస్రశీర్షా= అనేక శిరస్సులు కలవాడు, సహస్రాక్ష= అనేక కన్నులు కలవాడు,సహస్రపాత్=అనేక పాదాలు కలవాడు, సః = ఆయన, భూమిం = భూమిని, విశ్వతః = అన్ని దిశలా, వృత్వా = వ్యాపించి, దశ అంగుళమ్ = పది అంగుళాలు దాటి, అత్యతిష్ఠతి = నిలబడ్డాడు,యత్ భూతమ్ = ఇంతకు పూర్వం ఏది ఉన్నదో, యత్ భవ్యం చ = ఇక ఏది రాబోతున్నదో, ఇదం సర్వం = ఇప్పుడున్న సర్వం, పురుష ఏవ = భగవంతుడే, ఉత = మరియు, అమృతత్వస్య = మరణం లేని ఉన్నత స్థితికి, ఈశానః = అధిపతియైన వాడు, అన్నేన = జడ ప్రపంచాన్ని, అతిరోహతి = అతిక్రమించాడు.

అనేక తలలతో, పాదాలతో ఆ భగవంతుడు భూమిని అన్నివైపులా వ్యాపించి పది అంగుళాలు అధికంగా నిలబడ్డాడు. బ్రహ్మ వ్యాపకత్వం చెప్పటం దీని ఉద్దేశ్యం. మన ఊహాలో విశ్వం ఎంత పెద్దదో బ్రహ్మము అంతకన్నా పెద్దది. ఈ విశ్వం ఆయనలో అంతర్భాగము మాత్రమే. మునుపు ఏది ఉన్నదో, ఇక ఏది రాబోతోందో సమస్తం భగవంతుడే. మరణంలేని ఉన్నత స్థితికి అధిపతి ఆయనే ఎందుకంటే ఈ జడ ప్రపంచాన్ని అతిక్రమించాడు.

**ఏతావానస్యమహిమా। అతో జ్యాయాగ్శ్చ పూరుషః।**

**పాదో¬ స్య విశ్వాభూతాని। త్రిపాదస్యామృతం దివి॥**

ఏతావాన్ అస్య మహిమా = ఈ కనిపించేదంతా నీ విభూతే, అతః = కాని, పురుషః = భగవంతుడు, జ్యాయాన్ = శ్రేష్టుడు, భూతాని విశ్వా = ఉద్భవమైనవన్నీ, అస్య = ఆయన యొక్క, త్రిపాద్ = ముప్పాతిక భాగం, అమృతం = మరణంలేని, దివి = గగనం ఉంది.

ఇక్కడ కనిపించేదంతా భగవత్ మహిమే, భగవంతుడే వీటి కన్నా శ్రేష్ఠుడు. ఆయనే ఈ విశ్వానికి అధిష్టానంగా ఉన్నాడు. ఉద్భవించినవన్నీ ఆయనలో పావుభాగం మాత్రమే. ఆయనలో ముప్పాతిక భాగం వినాశనంలేని గగనంలో వుంది.

**త్రిపాదూర్ధ్వ ఉదైత్పురుషః పాదో¬ స్యేహా¬ భవాత్పునః।**

**తతో విష్వఙ్వ్యక్రామత్। సాశనానశనే అభి॥**

త్రిపాద్ = ముప్పావు, పురుషః = భగవంతుడు, ఊర్ధ్వః = పైన, ఉదైత్ = నెలకొని ఉన్నాడు, అస్య = ఆయనలో, పాదః = పావుభాగం, ఇహ = ఇక్కడ, పునః = మళ్ళీ, అభవాత్ = ఆవిర్భవించింది, తతః = ఆ తర్వాత, సాశనానశనే = ప్రాణులలో, జడ పదార్థాలలో, విష్వత్ = అంతా, అభివ్యక్రామత్ = జొరబడి వ్యాపించాడు.

భగవంతుని ముప్పాతిక భాగం పైన నెలకొని వుంది. తక్కిన పావుభాగం యీ ప్రపంచంగా ఆవిర్భవించింది. తరువాత ఆయన ప్రాణుల్లోను, జడపదార్థాల్లోను జొరబడి వ్యాపించాడు. ఆయన ఈ జగత్తుకి అంతర్యామిగా వుంటూ

ఈ జగత్తును తనలోనే ఇముడ్చుకున్నాడు. యశోదమ్మకి తన నోటిలో ఈ విశ్వాన్నంతా ప్రదర్శించలేదూ?
**తస్మాద్విరాడజాయత। విరాజో అధి పూరుషః।**
**స జాతో అత్యరిచ్యత। పశ్చాద్భూమిమథో పురః॥**
తస్మాత్ = ఆ ఆది పురుషునినుండి, విరాట్ = బ్రహ్మాండము, అజాయత = ఉద్భవించింది, విరాజో అధి = బ్రహ్మాండంతోపాటు, పూరుషః = బ్రహ్మ, జాతః = పుట్టి, అత్యరిచ్యత = సర్వత్రా వ్యాపించాడు, పశ్చాత్ = తదుపరి, సః = ఆయన, భూమిం = భూమిని, అతః = ఆ తరువాత, పురః = శరీరాలను.

ఆ ఆదిపురుషునినుండి బ్రహ్మాండం ఉద్భవించింది బ్రహ్మాండంతో పాటు బ్రహ్మ ఆవిర్భవించి సర్వత్రా వ్యాపించాడు. ఆ తరువాత ప్రాణులకు శరీరాలను సృష్టించాడు. పురుషసూక్తంలో రెండు కోవల సృష్టి చెప్పబడినట్లు సాయనాచార్యులు వివరించారు. పూర్వసృష్టిలో ప్రపంచాన్ని, దేవతలను, అనేక ప్రాణులను సృష్టించాడు. ఇంతవరకు పూర్వ సృష్టి అయింది. ఈ క్రింది మంత్రాలలో ఉత్తర సృష్టి మొదలౌతుంది. ఉత్తర సృష్టిలో ప్రాణుల ఆహారాన్ని, ఇతర పదార్థాలని సృష్టించాడు. ఇదంతా ఒక యజ్ఞమా అన్నట్టు కల్పన చేయబడింది.
**యత్పురుషేణ హవిషా। దేవ యజ్ఞమతన్వత।**
**వసంతో అస్యాసీదాజ్యమ్। గ్రీష్మ ఇధ్మశ్శరద్ధవిః॥**
పురుషేణ హవిషా = భగవంతుడైన ఆహుతి ద్వారా, దేవాః = దేవతలు, యత్ = ఏ, యజ్ఞం = యజ్ఞాన్ని, అతన్వత = చేశారో, అస్య = దానికి, వసంత కాలం, ఆజ్యం = నెయ్యిగాను, గ్రీష్మః = గ్రీష్మ (వేసవి) కాలం, ఇధ్మః = సమిధలుగాను, శరత్ = శరత్కాలం, హవిః = నైవేద్యంగాను, ఆసీత్ = అయినవి.
ఉత్తర సృష్టి యజ్ఞంలా చిత్రీకరించ బడింది కదా! అయితే యజ్ఞానికి కావల్సిన ఆహుతి వస్తువులు ఇంకా సృష్టించ బడలేదు. మరెలా? భగవంతుడ్నే ఆహుతి వస్తువుగా ఎంచుకున్నారు దేవతలు. అంటే ఆయనే ఈ సృష్టికి ముడిసరుకు - ఉపాదాన కారణం అని చెప్పకనే చెప్పటం అన్నమాట. భగవంతుణ్ణి ఆహుతి వస్తువుగా చేసుకుని దేవతలు నిర్వర్తించిన యజ్ఞానికి వసంతకాలం నెయ్యిగాను, వేసవికాలం సమిధలుగాను, శరత్కాలం నైవేద్యంగాను అయ్యాయి. కాలాలు నెయ్యి, సమిధలు, నైవేద్యం అయ్యాయి అంటే ఈ యజ్ఞం నిజంగా జరగలేదు కేవలం కవితా ధోరణిలో చెప్పడమే.
**సప్తాస్యాసన్పరిధయః। త్రిసప్త సమిధః కృతాః।**
**దేవా యద్యజ్ఞం తన్వానాః। అబధ్నన్పురుషం పశుమ్।**
అస్య = ఈ యజ్ఞానికి, సప్త = ఏడు (పంచభూతాలు + రాత్రి పగలు), పరిధయః = పరిధులుగా, ఆసన్ = అయినవి, త్రిసప్త = ఇరవై ఒక్క తత్త్వాలు. సమిధః = సమిధలుగా, కృతాః = కాబడినవి, దేవాః = దేవతలు, యజ్ఞం = యజ్ఞాన్ని, తన్వానాం = చేసినవారుగా, యత్ పురుషం = ఆ బ్రహ్మను, పశుమ్ = హోమపశువుగా, అబధ్నన్ = కట్టారు.

ఈ యజ్ఞానికి పంచభూతాలు, రాత్రి పగలు కలిసి ఏడు పరిధులయ్యాయి. ఇరవై ఒక్క తత్త్వాలు సమిధలయ్యాయి. దేవతలు మొదలుపెట్టిన ఈ యాగంలో బ్రహ్మను బలిపశువుగా కట్టారు. బ్రహ్మని బలిపశువుగా కట్టడమేమిటి? బ్రహ్మను బలిపశువుగా కట్టారంటే బ్రహ్మే ఉపాదాన కారణమని చెప్పడం. బ్రహ్మే ముడిసరుకయ్యాడు. పురుషసూక్తంలో సృష్టి ఒక యజ్ఞవిధిగా చిత్రణ జరుగుతోంది.
**తం యజ్ఞం బర్హిషి ప్రౌక్షన్। పురుషం జాతమగ్రతః।**
**తేన దేవా అయజంత। సాధ్యా ఋషయశ్చయే॥**
అగ్రతః = మొదట, జాతం = పుట్టిన, తం = ఆ యజ్ఞం, పురుషం= యజ్ఞపురుషుడైన బ్రహ్మకు, బర్హిషి = యాగంలో, ప్రౌక్షన్ = నీళ్ళు చల్లారు, తేన = తరువాత, దేవా = దేవతలు, సాధ్యాః = సాధ్యులూ, ఋషయః చ = ఋషులూ, ఏ = ఎవరెవరున్నారో వారందరూ, అయజంత = యాగాన్ని కొనసాగించారు.

మొదట ఉద్భవించిన ఆ యజ్ఞపురుషుడైన బ్రహ్మపై నీళ్ళు చల్లి ప్రోక్షణ చేసారు. పిదప దేవతలు, సాధ్యులు, ఋషులు, ఎవరెవరున్నారో ఆ యావన్మందీ యాగాన్ని కొనసాగించారు.
**తస్మాద్యజ్ఞాత్సర్వహుతః। సంభృతం పృషదాజ్యమ్।**
**పశూగ్స్తాగ్శ్చక్రే వాయువ్యాన్। ఆరణ్యాన్ గ్రామ్యాశ్చ యే॥**
తస్మాత్ = దానినుంచి, యజ్ఞాత్ = ఆ యాగం నుంచి, పృషదాజ్యం = పెరుగు కలిసిన నెయ్యి, సంభృతం = పుట్టింది, వాయువ్యాన్ = పక్షులను, అరణ్యాన్ = మృగాలను, యే = ఏవి, గ్రామ్యాశ్చ = సాధుమృగాలను, తాన్ పశూన్ = ఇతర ప్రాణులను, చక్రే = బ్రహ్మ సృష్టించాడు.

బ్రహ్మ వల్ల ఆ యాగంనుంచి పెరుగు కలిపిన నెయ్యి పుట్టింది, పక్షులు, క్రూరమృగాలు, సాధుమృగాలు, అనేక ప్రాణులు పుట్టాయి. ఇంతకు ముందు మంత్రంలో బ్రహ్మ ముడిసరుకయ్యాడన్నాము. ఆయన పూర్తిగా జగత్తుగా మారి పోతే బ్రహ్మ మరిక ఉండడు. ఇక్కడ బ్రహ్మనుంచి ఈ జగత్తు మన స్వప్నంలాగా ప్రకటమైందన్న మాట.
**తస్మాద్యజ్ఞాత్సర్వహుతః। ఋచః సామాని జజ్ఞిరే।**
**ఛందాగ్ంసి జజ్ఞిరే తస్మాత్। యజుస్తస్మాదజాయత॥**

సర్వహుతః = ప్రపంచ యజ్ఞమైన, తస్మాత్ యజ్ఞాత్ = ఆ యాగం నుండి, ఋచః = ఋగ్వేదమంత్రాలు, సామాని = సామవేద మంత్రాలు, జజ్ఞిరే = ఉత్పన్నమైనాయి, తస్మాత్ = అందునుండి, యజుః = యజుర్వేదం, అజాయత = పుట్టింది.

సృష్టి ప్రక్రియైన ఆ యజ్ఞంనుంచి ఋగ్వేద మంత్రాలు, సామవేద మంత్రాలు, యజుర్వేద మంత్రాలు పుట్టాయి.

**తస్మాదశ్వా అజాయంత। యే కే చోభయాదతః।**
**గావో హ జజ్ఞిరే తస్మాత్। తస్మాజ్జాతా అజావయః॥**

తస్మాత్ = దానినుంచే అశ్వాః = గుర్రాలు, అజాయంత = ఉద్భవించాయి, యే కే ఉభయాదతః = రెండు వరుసల దంతాలుగల మృగాలు, గావః చ = పశువులు, తస్మాత్ = అందులో నుండే, జజ్ఞిరే = ఉత్పన్నమైనాయి, అజాః = గొర్రెలు, అవయః = గేదెలు, జాతాః = పుట్టాయి.

ఆ యజ్ఞం నుంచే గుర్రాలు, రెండు వరుసల దంతాలుగల మృగాలు, పశువులు, గొర్రెలు, గేదెలు పుట్టాయి.

**యత్పురుషం వ్యదధుః। కతిధా వ్యకల్పయన్।**
**ముఖం కిమస్య కౌ భాహూ। కావూరూ పాదావుచ్యేతే॥**

యత్ = ఎప్పుడు, పురుషం = బ్రహ్మను, వ్యదధుః = బలి ఇచ్చారో, కతిధా = ఏ ఏ రూపాలుగా, వ్యకల్పయన్ = చేశారు, అస్య = ఆయన యొక్క, ముఖం = ముఖము, కిం = ఏదిగా, ఆసీత్ = అయినది, బాహూ = చేతులుగా, కౌ = ఏది, ఉచ్యేతే = చెప్పబడింది.

బ్రహ్మని దేవతలు బలియిచ్చినప్పుడు ఆయనను ఏ ఏ రూపాలుగా చేశారు? ఆయన ఎలా అయ్యాడు? ఆయన చేతులే విధంగా చెప్పబడ్డాయి? తొడలు, పాదాలుగా ఏవిగా చెప్ప బడ్డాయి? సృష్టి ఆ బ్రహ్మ ప్రకటరూపమే కాని బ్రహ్మ యొక్క పరిణామం కాదు. బ్రహ్మ తాను ఏ మాత్రం మారకుండా ఆయన నుంచి ఓ స్వప్నం లాగా ఈ జగత్తు ప్రకటించబడింది. దీనిని వివర్తం అంటారు. నీరు నీరులాగే వుంటూ సాగరంలాగా, తరంగంలాగా, బుడగలాగా, నురుగులాగా, తుంపరలాగా కనిపించటం లేదు?

**బ్రాహ్మణో¬స్య ముఖమాసీత్। బాహూ రాజన్య కృతః।**
**ఊరూ తదస్య యద్వైశ్యః। పద్భ్యాగ్ం శూద్రో అజాయతః॥**

అస్య = ఆయన యొక్క, ముఖం = ముఖము, బ్రాహ్మణః = బ్రాహ్మణుడుగా, ఆసీత్ = అయింది, బాహూ = చేతులు, రాజన్యః = క్షత్రియుడుగా, కృతః = చేయబడింది, అస్య = ఆయన యొక్క, ఊరూ = తొడలు, యత్ = ఏవో, తత్ = అవి, వైశ్యః = వైశ్యుడుగా అయింది, పద్భ్యాం = పాదాలనుండి, శూద్రః = శూద్రుడు, అజాయత = ఉద్భవించాడు.

ఆయన ముఖం నుంచి బ్రాహ్మణుడు, బాహువుల నుంచి క్షత్రియులు, తొడలనుంచి వైశ్యులు, పాదాలనుంచి శూద్రులు ప్రకటమయ్యారు. ఈ మంత్రం ప్రస్థుత సమాజానికి అలజడిని కలిగిస్తుంది. అయితే ఈ విభజన గుణపరంగాను, కర్మపరంగాను స్వీకరించాలి. **చాతుర్వర్ణం మయాసృష్టం గుణకర్మ విభాగశః** భగవద్గీత 14-3. గీతలో భగవాన్ కృష్ణపరమాత్మ ఈ విషయమే ప్రస్తావించాడు. విశ్వామిత్రుడు పుట్టుకతో క్షత్రియుడు. కాని ఆయన స్వీకరించిన తపోనిష్ఠవల్ల ఆయన్ని బ్రాహ్మణుడన్నారు(బ్రహ్మర్షి). ప్రతి సమాజంలోను శాస్త్రవేత్తలు, శాస్త్రపరిరక్షకులు, ఉపాధ్యాయులు ఉంటారు. వీరినే మన శాస్త్రం బ్రాహ్మణులు అంది. సంఘసేవకులు సంఘరక్షణమీద ఆసక్తి ఉన్నవారు క్షత్రియులు. వ్యాపారవేత్తలు వైశ్యులు. పై ముగ్గురుకి సేవాకార్యము చేసేవారు శూద్రులు. శూద్రులను పాదాల్నించి ప్రకటమయ్యారు అనడంలో అర్థం వారి ఆధారం, సాయం లేనిదే సమాజంలో ఏ పని జరగదు. వారు సమాజానికి పునాది లాంటి వారని అర్థం. విష్ణువుని త్రివిక్రముడు, మూడు అడుగులేసినవాడని, రురుక్రముడని, పెద్దపెద్ద అడుగులవాడని అంటారు. పాదాలకి అధిష్టాన దేవత విష్ణువు. నేను బ్రాహ్మణుడను, నేను శూద్రుడను అను భావనలు - కేవలం ఏకం, సత్యం, నిత్యం అయిన సచ్చినాంద పరమాత్మ మీద అధ్యారోపితాలే. **తత్ర కో మోహః కః శోకః ఏకత్వమనుపశ్యతి** అంటుంది ఈశావాశ్యం. **మెండైన బ్రాహ్మణుడు మెట్టు భూమి ఒకటే, చండాలుడుంటేటి సరి భూమి ఒకటే** అన్నాడు అన్నమయ్య.

**చంద్రమా మనసో జాతః। చక్షో సూర్యో అజాయత।**
**ముఖాదింద్రశ్చాగ్నిశ్చ। ప్రాణద్వాయురజాయత॥**

మనసః = మనస్సునుండి, చంద్రమా = చంద్రుడు, జాతః = పుట్టాడు, చక్షోః = కంటినుండి, సూర్యః = సూర్యుడు, ఆజాయత = పుట్టాడు, ముఖాత్ = ముఖం నుండి, ఇంద్రః చ = ఇంద్రుడు, అగ్నిః చ = అగ్ని ఉద్భవించాయి. ప్రాణాత్ = ప్రాణం నుండి, వాయుః = వాయువు, అజాయత = ఉద్భవించాయి.

బ్రహ్మ మనస్సునుండి చంద్రుడు, కంటి నుండి సూర్యుడు, ముఖం నుండి ఇంద్రాగ్నులు, ప్రాణంనుండి వాయువు పుట్టాయి.

**నాభ్యా ఆసీదంతరీక్షమ్। శీర్ష్ణో ద్యౌః సమవర్తత।**
**పద్భ్యాం భూమిర్దిశః శ్రోత్రాత్। తథా లోకాగ్ం అకల్పయన్॥**
నాభ్యా = నాభి నుండి, అంతరిక్షం = అంతరిక్షము (ఆకాశం), ఆసీత్ = పుట్టింది, శీర్ష = శిరస్సునుండి, ద్యౌః = స్వర్గం, సమవర్తతః = సముద్భవించింది, పద్భ్యాం = పాదాలనుండి, భూమిః = భూమి, శ్రోత్రాత్ = చెవినుండి, దిశః = దిశలు, తథా = అలాగే, లోకాన్ = లోకాలన్నీ, అకల్పయన్ = పుట్టాయి.

బ్రహ్మ నాభినుండి అంతరీక్షం ఉద్భవించింది. శిరస్సునుండి స్వర్గం, పాదాలనుండి భూమి, చెవుల నుండి దిశలు ఉత్పన్నమయ్యాయి. అలాగే ఈ లోకాలన్నీ సృష్టించబడ్డాయి.

**వేదాహమేతం పురుషం మహాంతమ్। ఆదిత్యవర్ణం తమసస్తుపారే।**
**సర్వాణి రూపాణి విచిత్య ధీరః। నామాని కృత్వా¬భివదన్ యదాస్తే॥**
సర్వాణి = అన్ని, రూపాణి = రూపాలను, విచిత్య = సృష్టించి, నామాని = పేర్లతో సహా, కృత్వా = కూర్చి, యత్ = ఏ, ధీరః = భగవంతుడు, అభివదన్ ఆస్తే = క్రియాశీలుడై ఉన్నాడో, మహాంతమ్ = మహిమాన్వితుడైన, ఆదిత్యవర్ణం = సూర్యునిలా ప్రకాశించే వాడు , తమసః తు = అంధకారానికి, పారే = దూరంగా ఉన్నవాడూ, తం పురుషమ్ = ఆ భగవంతుని, అహం = నేను, వేద = తెలుసుకొన్నాను.

సమస్త రూపాలను నామాలతో సృష్టించి, తాన్ క్రియాశీలుడై ఉంటూ, మహిమాన్వితుడు, సూర్యునిలా ప్రకాశించేవాడు, అంధకారానికి సుధూరుడు అయిన భగవంతుని నేను తెలుసుకొన్నాను.

**ధాతా పురస్తాద్యముజహార।శక్రః ప్రవిద్వాన్ప్రదిశశ్చతస్రః।**
**తమేవం విద్వానమృత ఇహ భవతి।నాన్యః పంథా అయనాయ విద్యతే॥**
యం = ఏ భగవంతుని, ధాతా = బ్రహ్మ, పురస్తాత్ = ఆదిలో, ఉదాజహార = పరమాత్మ అని గ్రహించి చెప్పాడో, శక్రః = ఇంద్రుడు, ప్రదిశః చతస్రః = నాలుగు దిశలలో యావత్తు, ప్రవిద్వాన్ = చక్కగా దర్శించాడో, తం = ఆయనను, ఏవం = ఇలా, విద్వాన్ = తెలుసు కొనేవాడు, ఇహ = ఇక్కడే, అమృతః = ముక్తుడుగా, భవతి = అవుతాడు, అయనాయ = మోక్షానికి, అన్యః = ఇతర, పంథా = మార్గం, న విద్యతే = లేదు.

ఏ భగవంతుని చతుర్ముఖ బ్రహ్మ మొదటగా పరమాత్మగా దర్శించి తెలిపాడో, ఇంద్రుడు నాలుగు దిశలలో అంతటా చక్కగా చూశాడో, ఆయనను యిలా గ్రహించినవాడు ఇక్కడే, అంటే యీ జన్మలోనే ముక్తుడవుతాడు. మోక్షానికి మరో మార్గం లేదు. ఇక్కడ వున్నదంతా పరమాత్మ ప్రకటరూపమని గ్రహించినవాడు. ఈ జగత్తు సర్వం మిథ్య అని, పరమాత్మే సత్యము, నిత్యమని గ్రహించి బ్రహ్మ నిష్ఠలో నిలిచిన వాడు జీవన్ముక్తుడు. మోక్షానికి ఈ పారమార్థిక సత్యం గ్రహించడం తప్ప మరొక దారి లేదు. కుండకి - మట్టికి దూరం ఎంత? మట్టే కుండ. కుండ ఆ మట్టికే కొత్తగా తెచ్చిపెట్టిన నామం- రూపం మాత్రమే. అదే విధంగా ఇక్కడున్నదంతా ఆ సచ్చిదానంద పరమాత్మే.

**యజ్ఞేన యజ్ఞమయజంత దేవాః। తాని ధర్మాణి ప్రథమాన్యాసన్।**
**తేహనాకం మహిమానః సచంతే। యత్ర పూర్వే సాధ్యాః సంతి దేవాః॥**
దేవాః = దేవతలు, యజ్ఞేన = ఈ యజ్ఞం ద్వారా, యజ్ఞం = భగవంతుని, అయజంత = పూజించారు, ప్రథమాని = ప్రప్రథమ, ధర్మాణి = ధర్మాలు, అసన్ = అయినవి, యత్ర = ఎక్కడ, పూర్వే = ఆరంభంలో, సాధ్యాః = సాధ్యులు, దేవాం = దేవతలు, సంతి = ఉన్నారో, నాకం = ఉన్నత లోకాన్ని, తే మహిమానః = ఆ మహాత్ములు, సచంతే = పొందుతారు.

దేవతలు యజ్ఞం ద్వారా భగవంతుని ఆరాధించారు. అవి ప్రప్రథమ ధర్మాలయ్యాయి. ప్రారంభంలో ఎక్కడ యజ్ఞం ద్వారా భగవంతుణ్ణి ఆరాధించిన సాధ్యులు, దేవతలు వసిస్తున్నారో, ధర్మాన్ని ఆచరించే మహాత్ములు ఆ ఉన్నత లోకాన్ని ప్రాప్తించు కొంటారు.

**అద్భ్యః సంభూతః పృథివ్యై రసాచ్చ। విశ్వకర్మణ సమవర్తతాధి।**
**తస్య త్వష్టా విదధద్రూపమేతి। తత్పురుషస్య విశ్వమాజానమగ్రే॥**
అద్భ్య = నీటినుండి, పృథివ్యై = భూమియొక్క, రసాత్ = సారమైన అంశం నుండి, సంభూతః = ప్రపంచం ఉద్భవించింది, విశ్వకర్మణః = విశ్వాన్ని సృజించిన భగవంతునినుండి, అధి = శ్రేష్ఠుడు, సమవర్తత = ఉద్భవించాడు, త్వష్టా = భగవంతుడు, తస్య = బ్రహ్మయొక్క, రూపం = రూపాన్ని, విదధత్ = రూపొందించి, ఏతి = వ్యాపించి ఉన్నాడు, తత్ = ఆ, పురుషస్య = బ్రహ్మయొక్క, విశ్వం = ఈ ప్రపంచరూపు, అగ్రే = ఆదిలో, ఆజానం = ఉద్భవించింది.

నీటినుంచి, భూసారంనుంచి ప్రపంచం ఉద్భవించింది. ప్రపంచాన్ని సృష్టించిన శ్రేష్ఠుడైన బ్రహ్మ లోకాల రూపాలని చక్కదిద్ది దాన్లో వ్యాపించాడు. బ్రహ్మ యొక్క రూపు ఈ ప్రపంచ రూపు సృష్ట్యాదిలో ఉద్భవించింది. ఇంతటితో అధ్యారోపం పూర్తయింది. అంటే ఎటువంటి వికారాలు చెందని ఆ నిర్గుణ పరబ్రహ్మ మీద జీవ, జగత్తు , ఈశ్వరులు మూడూ ఆరోపించబడ్డాయి.

**వేదాహమేతం పురుషం మహాన్తమ్। ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్।**

**తమేవం విద్వానమృత ఇహ భవతి। నాన్య పంథా విద్యతే ¬యనాయ॥**

మహాంతమ్ = మహిమాన్వితుడు, ఆదిత్యవర్ణం = సూర్యునిలా ప్రకాశించేవాడు, తమసః = అంధకారానికి, పరస్తాత్ = సుదూరుడు, ఏతం = ఈ, పురుషం = భగవంతుని, అహం = నేను, వేద = తెలుసుకొన్నాను, తం = ఆయనను, ఏవం = ఇలా, విద్వాన్ = తెలుసుకొనేవాడు, ముక్తః = ముక్తుడు, భవతి= అవుతాడు, అయనాయ = ముక్తికి, అన్యః = వేరు, పంథా = దారి, న విద్యతే = లేదు.

మహిమాన్వితుడు,సూర్యునిలా ప్రకాశమానుడు, అంధకారాన్ని నిర్మూలన చేసేవాడు అయిన భగవంతుని నేను ఎరుగుదును. ఆయనను ఇలా తెలుసుకొనేవాడు యిక్కడే యీ జన్మలోనే ముక్తుడౌతాడు. ముక్తికి ఇంతకంటే మరో దారిలేదు. కుండకి తాను కేవలం మట్టినే అని తెలుసు కోవాలంటే ఏం చెయ్యాలి? మట్టి వినా కుండగా తన ఉనికి లేదు. మట్టినుంచి కుండ ఎన్నటికీ వేరు కాలేదు అని తెలుసు కోవాలంటే - తీర్థ యాత్రలు చేయాలా? పూజలు - యాగాలు చేయాలా? లేదా ధ్యానం చేయాలా? కేవలం తెలుసు కుంటే చాలు. **తను మట్టి మాత్రమే కుండ కాదు** అనే ఎరుక(నిశ్చయ జ్ఞానం)లో నిరంతరం నిలిస్తే చాలు. అదే విధంగా **నేను ఆ పరమాత్మ కన్నా భిన్నంగా లేను** అనే బ్రహ్మ నిష్ఠలో వుంటే చాలు. **నాన్య పంథా విద్యతే ¬యనాయ॥ నాన్య పంథా** అని రెండవ మారు చెపుతోంది పురుష సూక్తం. దీని తాత్పర్యం పూజలను, యాగాలను, ధ్యానాన్ని తూలనాడడం కాదు. శాస్త్రం లో దీన్ని **నహి నిందా న్యాయం** అంటారు. విహిత కర్మలు చేయడం ద్వారా అంతఃకరణ శుద్ధి కలుగుతుంది. అధికారత్వం సిద్ధిస్తుంది. మోక్షానికి మాత్రం జ్ఞానమొక్కటే శరణ్యం అని నొక్కి చెప్పటం. **జ్ఞానాత్ ఏవ తు కైవల్యం.**

**ప్రజాపతి శ్చరతి గర్భే అంతః। అజాయమానో బహుధా విజాయతే॥**

**తస్య ధీరా పరిజానంతి యోనిమ్। మరీచినాం పదమిచ్ఛంతి వేధసః॥**

ప్రజాపతిః = భగవంతుడు, గర్భే అంత = ప్రపంచం లోపల, చరతి = సంచరిస్తునాడు, అజాయమానః = జన్మించనివాడిగా ఉంటూనే, బహుధా = అనేక రూపాలతో, విజాయతే = ఉద్భవిస్తున్నాడు, తస్య = ఆయన యొక్క, యోనిమ్ = నిజరూపాన్ని, ధీరాః = మహాత్ములు, పరిజానంతి = చక్కగా తెలుసుకొంటారు, వేదసః = బ్రహ్మవంటివారు, మరీచీనాం = మరీచి ప్రభృత మహాత్ముల, పదం = పదవిని, ఇచ్ఛంతి = అభిలషిస్తున్నారు.

భగవంతుడు ప్రపంచంలో క్రియాశీలుడుగా మసులుతున్నాడు. జన్మలేకుండానే అనేక రూపాలతో ఇక్కడ ప్రకటమౌతున్నాడు. ఆయన ఈ నిజస్వరూపాన్ని మహాత్ములు బాగుగా గ్రహించారు. చతుర్ముఖ బ్రహ్మవంటివారు సైతం మరీచీ మొదలైన మహాత్ముల స్థితిని ఆకాంక్షిస్తున్నారు. అసలు పుట్టుకే లేనివాడు ఇన్ని రకాలుగా కన్పిస్తున్నాడు అనటంలో సృష్టి ఒక కల్పన లేదా మిథ్య అని సృష్టి సత్యత్వాన్ని నిరాకరించడమైంది. దీనితో అపవాదం పూర్తయింది.

**యో దేవేభ్య ఆతపతి। యో దేవానాం పురోహితః।**

**పూర్వో యో దేవేభ్యో జాతఃనమో రుచాయ బ్రాహ్మయే॥**

యః = ఎవరు, దేవేభ్యః = దేవతలకు, ఆతపతి = తేజస్సుగా ఉంటున్నాడో, యః = ఎవరు, దేవేభ్యః = దేవతలకు, పూర్వః = పూర్వమే, జాతః = పుట్టాడో, రుచాయ = ప్రకాశమానమైన, బ్రాహ్మయే = ఆ భగవంతునికి, నమః = నమస్కారము.

ఎవరు దేవతలకు తేజస్సుగా వెలుగొందుతున్నాడో, దేవతల గురువై, దేవతలకంటే ముందే పుట్టాడో, ఆ తేజోమయ భగవంతునకు నమస్కారము.

**రుచం బ్రాహ్మం జనయంతః। దేవా అగ్రే తదబ్రువన్।**

**యస్త్వేవం బ్రాహ్మణో విద్యాత్। తస్య దేవా అసన్ వశే॥**

బ్రాహ్మం = భగవంతుని గురించిన, ఋచం = సత్యాన్ని, జనయంతః = తెలిపేటప్పుడు, దేవాః = దేవతలు, అగ్రే = ఆదిలో, తత్ = దానిని గురించి, అబ్రువన్ = చెప్పారు, యః తు = ఎవరైనప్పటికి, బ్రాహ్మణః = భగవంతుని అన్వేషించేవాడు, ఏవం = ఇలా, విద్యాత్ = తెలుసు కొంటే, తస్య = అతడికి, దేవాః = దేవతలు, వశః = వశులు, అసన్ = అవుతారు.

భగవంతుని గురించిన సత్యాన్ని తెలిపేటప్పుడు దేవతలు ఆదిలో దానిని యిలా అన్నారు; "భగవంతుణ్ణి అన్వేషించేవారు ఇలా తెలుసుకొంటే" అతడికి దేవతలు వశులౌతారు.

**హ్రీశ్చతే లక్ష్మీశ్చ పత్న్యౌ। అహోరాత్రే పార్శ్వే।**

**నక్షత్రాణి రూపమ్ అశ్వినౌ వ్యాత్తమ్॥**

హ్రీః చ = లజ్జా స్వరూపిణి, హ్రీ దేవీ, లక్ష్మీ చ = లక్ష్మీ దేవీ, తే = మీ, పత్నౌ = పత్నులు, అహోరాత్రే = రేయింపగళ్ళు, పార్శ్వే = పార్శ్వాలు, నక్షత్రాణి = నక్షత్రాలు, రూపమ్ = దివ్యరూపం, అశ్వినౌ = అశ్వనీదేవతలు, వ్యాత్తమ్ = వికసిత వదనం.

లజ్జా స్వరూపిణియైన హ్రీదేవీ, సిరులకు ఆలవాలమైన లక్ష్మీదేవీ నీ అర్ధాంగినులు. రేయింబవళ్ళు నీ పార్శ్వాలు. నక్షత్రాలు నీ దివ్యరూపం. అశ్వినీదేవతలు నీ వికసిత వదనం.

**ఇష్టం మనిషాణ। అముం మనిషాణ। సర్వం మనిషాణ॥**

ఇష్టం మనిషాణ = మేము కోరినవి మాకు ప్రసాదించు, అముం మనిషణ = ఈ ప్రపంచ సుఖం మా కొసగు, సర్వం మనిషాణ = ఇహపరాలలో సర్వం మాకు ప్రసాదించు.

మేము కోరినవి మాకు ప్రసాదించు, ఈ ప్రపంచ సుఖం మా కొసగు, ఇహపరాలలో సర్వం మాకు ప్రసాదించు.

**ఓం తచ్ఛం యోరావృణీమహే। గాతుం యజ్ఞాయ।గాతుం యజ్ఞపతయే।**
**దైవీ స్వస్తిరస్తునః। స్వస్తిర్మానుషేభ్యః।ఊర్ధ్వం జిగాతు బేషజమ్।**
**శం నో అస్తు ద్విపదే। శం చతుష్పదే॥**
**ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

యః = ఎవరు, శం = మంగళం ప్రసాదిస్తారో, తత్ = ఆ భగవంతుని, అవృణీమహే = ప్రార్థిస్తాము, యజ్ఞాయ = యజ్ఞం చక్కగా సాగాలని, గాతుం = కోరుతున్నాము, యజ్ఞపతియే = యజ్ఞకర్తకు సుఖశాంతులు ఇమ్మని, గాతుం = కోరుతున్నాము, నః = మాకు, దైవీ = దేవతలు, స్వస్తిః అస్తు = మేలు చేయుగాక, మానుషేభ్యః = మానవులందరికి, స్వస్తి = మేలు కలుగుగాక, బేషజమ్ = చెట్టుచేమలు, ఊర్ధం జిగాతు = ఊర్ధ్వముఖంగా పెరుగుగాక, నః = మనవద్ద ఉన్న, ద్విపదే = రెండు పాదాల జీవులకు, శం అస్తు = సుఖం కలుగు గాక, చతుష్పదే = నాలుగు పాదాల జీవులకు, శం = మేలు జరుగు గాక.

ఎవరివల్ల మనకు శుభాలు కలుగుతాయో ఆ భగవంతుని ప్రార్థిద్దాం. యజ్ఞం నిర్వర్తించే వారికోసం, యజ్ఞం ఏ విఘ్నాలు లేకుండా పరిసమాప్తి కావాలని ప్రార్థిద్దాం. దేవతలు మనకు శుభం కలుగ చేయుగాక. మానవులందరికీ మేలు కలుగ చేయుగాక. చెట్లు ఉర్ధ్వముఖంగా ఏపుగా పెరుగుగాక. మన వద్ద జీవిస్తున్న రెండు కాళ్ళ, నాలుగు కాళ్ళ జీవులు సుఖంగా వుండు గాక.మాకు ఆదిభౌతిక, ఆదిదైవిక, ఆధ్యాత్మిక ప్రతిబంధకాలు లేకుండుగాక.

ఈ విధంగా సృష్టి ప్రకరణం యజ్ఞవిధిగా వర్ణించ బడింది. దీని లక్ష్యార్థాలు -

1. ఇక్కడ ఉన్నదేదీ భగవంతుని కన్నా భిన్నంగా లేదు. అవ్యక్తంగా ఉన్న బ్రహ్మమే వివిధంగా వ్యక్తమౌతోంది. **అవ్యక్తం వ్యక్తమాపన్నం మన్యంతే మమబుద్ధయః॥** - గీత - 7 - 24.
2. ఇక్కడ ఏది చూసినా, ఏది విన్నా, ఏది ముట్టుకున్నా, ఏ అనుభవం కలిగినా అంతా బ్రహ్మమే. ప్రతి అనుభవంలో బ్రహ్మ దర్శనం అవుతోంది. **ప్రతిబోధ విదితం మతం**.
3. ఇక్కడ ఉన్నదంతా ఆ బ్రహ్మే అయితే, మరి నేనెవరిని? నేనూ స్వరూపంలో ఆ బ్రహ్మనే.
4. నానా రకాలుగా కనిపించే ఈ జగత్తు కేవలం కల్పనే. మిథ్య మాత్రమే.
5. ఉన్నదంతా బ్రహ్మమే అయితే అయన కానిదేది లేదు. ఆయన పూర్ణుడు.
6. స్వరూపతః నేను బ్రహ్మని కాబట్టి నేను పూర్ణుడను. నాకు ఏ వెలితీ లేదు. నేను నిత్యుడను, ముక్తుడను.

****

# సస్వర పురుషసూక్తం

ఓం తచ్ఛం యోరావృణీమహే। గాతుం యజ్ఞాయ।గాతుం యజ్ఞపతయే।
దైవీ స్వస్తిరస్తునః। స్వస్తిర్మానుషేభ్యః। ఊర్ధ్వం జిగాతు బేషజమ్।
శం నో అస్తు ద్విపదే। శం చతుష్పదే॥
ఓం శాంతిః శాంతిః శాంతిః॥

ఓం సహస్రశీర్షా పురుషః। సహస్రాక్షః సహస్రపాత్।
స భూమిం విశ్వతో వృత్వా। అత్యతిష్ఠద్దశాంగులమ్॥ 1
పురుష ఏవేదగ్ం సర్వమ్। యద్భూతం యచ్చ భవ్యమ్।
ఉతామృతత్వస్యేశానః। యదన్నేనాతిరోహతి॥ 2
ఏతావానస్యమహిమా। అతో జ్యాయాగ్శ్చ పూరుషః।
పాదో¬స్య విశ్వాభూతాని। త్రిపాదస్యామృతం దివి॥ 3
త్రిపాదూర్ధ్వ ఉదైత్పురుషః పాదో ¬ స్యేహా¬ భవాత్పునః।
తతో విష్వఙ్వ్యక్రామత్। సాశనానశనే అభి॥ 4
తస్మాద్విరాడజాయత। విరాజో అధి పూరుషః।
స జాతో అత్యరిచ్యత। పశ్చాద్భూమిమథో పురః॥ 5

యత్పురుషేణ హవిషా। దేవ యజ్ఞమతన్వత।
వసంతో అస్యాసీదాజ్యమ్। గ్రీష్మ ఇధ్మశ్శరద్ధవిః॥ 6
సప్తాస్యాసన్పరిధయః। త్రిస్సప్త సమిధః కృతాః।
దేవా యద్యజ్ఞం తన్వానాః। అబధ్నన్పురుషం పశుమ్॥ 7
తం యజ్ఞం బర్హిషి ప్రౌక్షన్। పురుషం జాతమగ్రతః।
తేన దేవా అయజంత। సాధ్యా ఋషయశ్చయే॥ 8
తస్మాద్యజ్ఞాత్సర్వహుతః। సంభృతం పృషదాజ్యమ్।
పశూగ్స్తాగ్శ్చక్రే వాయవ్యాన్। ఆరణ్యాన్ గ్రామ్యాశ్చ యే॥ 9
తస్మాద్యజ్ఞాత్సర్వహుతః। ఋచః సామాని జజ్ఞిరే।
ఛందాగ్ంసి జజ్ఞిరే తస్మాత్। యజుస్తస్మాదజాయత॥ 10
తస్మాదశ్వా అజాయంత। యే కే చోభయాదతః।
గావో హ జజ్ఞిరే తస్మాత్। తస్మాజ్జాతా అజావయః॥ 11
యత్పురుషం వ్యదధుః। కతిధా వ్యకల్పయన్।
ముఖం కిమస్య కౌ బాహూ। కావూరూ పాదావుచ్యేతే॥ 12
బ్రాహ్మణో¬స్య ముఖమాసీత్। బాహూ రాజన్య కృతః।
ఊరూ తదస్య యద్వైశ్యః। పద్భ్యాగ్ం శూద్రో అజాయతః॥ 13
చంద్రమా మనసో జాతః। చక్షో సూర్యో అజాయత।
ముఖాదింద్రశ్చాగ్నిశ్చ। ప్రాణద్వాయురజాయత॥ 14
నాభ్యా ఆసీదంతరిక్షమ్। శీర్ష్ణో ద్యౌః సమవర్తత।
పద్భ్యాం భూమిర్దిశః శ్రోత్రాత్। తథా లోకాగ్ం అకల్పయన్॥ 15
వేదాహమేతం పురుషం మహాంతమ్। ఆదిత్యవర్ణం తమసస్తుపారే।
సర్వాణి రూపాణి విచిత్య ధీరః। నామాని కృత్వా¬భివదన్ యదాస్తే॥ 16
ధాతా పురస్తాద్యముదాజహార।శక్రః ప్రవిద్వాన్ప్రదిశశ్చతస్రః।
తమేవం విద్వానమృత ఇహ భవతి। నాన్యః పంథా అయనాయ విద్యతే॥ 17
యజ్ఞేన యజ్ఞమయజంత దేవాః। తాని ధర్మాణి ప్రథమాన్యాసన్।
తేహనాకం మహిమానః సచంతే। యత్ర పూర్వే సాధ్యాః సంతి దేవాః॥ 18
అద్భ్యః సంభూతః పృథివ్యై రసాచ్చ। విశ్వకర్మణ సమవర్తతాధి।
తస్య త్వష్టా విదధద్రూపమేతి। తత్పురుషస్య విశ్వమాజానమగ్రే॥ 19
వేదాహమేతం పురుషం మహాన్తమ్। ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్।
తమేవం విద్వానమృత ఇహ భవతి। నాన్య పంథా విద్యతే ¬యనాయ॥ 20
ప్రజాపతి శ్చరతి గర్భే అంతః। అజాయమానో బహుధా విజాయతే।
తస్య ధీరా పరిజానంతి యోనిమ్। మరీచినాం పదమిచ్ఛంతి వేధసః॥ 21
యో దేవేభ్య ఆతపతి। యో దేవానాం పురోహితః।
పూర్వో యో దేవేభ్యో జాతః। నమో రుచాయ బ్రాహ్మయే॥ 22
రుచం బ్రాహ్మం జనయంతః। దేవా అగ్రే తదబ్రువన్।
యస్త్వైవం బ్రాహ్మణో విద్యాత్। తస్య దేవా అసన్ వశే॥ 23
హ్రీశ్చతే లక్ష్మీశ్చ పత్న్యౌ। అహోరాత్రే పార్శ్వే।
నక్షత్రాణి రూపమ్ అశ్వినౌ వ్యాత్తమ్। ఇష్టం మనిషాణ।
అముం మనిషాణ। సర్వం మనిషాణ॥ 24
ఓం తచ్ఛం యోరావృణీమహే। గాతుం యజ్ఞాయ।గాతుం యజ్ఞపతయే।
దైవీ స్వస్తిరస్తునః। స్వస్తిర్మానుషేభ్యః।ఊర్ధ్వం జిగాతు భేషజమ్।
శం నో అస్తు ద్విపదే। శం చతుష్పదే॥

ఓం శాంతిః శాంతిః శాంతిః॥